క్లుప్తంగా

టీఎస్ యూటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక

ధర్మసాగర్: టీఎస్ యూటీఎఫ్ మండల కమిటీని జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి సీహెచ్.రవీందర్ రాజు, పెండెం రాజు ఆధ్వర్యంలో శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శివరతన్ సింగ్, ప్రధాన కార్యదర్శిగా కే సురేశ్, ఉపాధ్యక్షుడిగా ఎం.గిరిధరా చార్యులు, మహిళా ఉపాధ్యక్షురాలిగా కే.రాజమ్మ, కోశాధికారిగా గణేష్, కార్యదర్శులుగా రవీందర్, రవీందర్‌రెడ్డి, కిరణ్మయి లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం జిల్లా ప్రధాన కార్యదర్శి పెండెం రాజు మాట్లాడుతూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మరోసారి అలుగుబెల్లి నర్సిరెడ్డికి ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు సీఎస్ఆర్ మల్లిక్, చుంచుకాల లింగారావు, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ సదానందం తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్



నడికూడ: మండలంలోని కంఠాత్మకూర్ గ్రామ సెంటర్‌లో శనివారం రాత్రి దామెర పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. కమలాపురం మండలం వంగపల్లికి చెందిన ఆకునూరి విజయ్ అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్ గుర్తించి స్వాధీన పరచుకొని దామెర పోలీస్‌స్టేషన్‌కు తరలించి సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై కొంక అశోక్ తెలిపారు.

గేదె అపహరణ

కమలాపూర్: మండలంలోని శనిగరం గ్రామంలో చెరిపెల్లి రాజేందర్‌కు చెందిన గేదె శుక్రవారం అపహరణకు గురైనట్లు ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ శనివారం తెలిపారు. రాజేందర్ గ్రామ శివారులోని తన వ్యవసాయ భూమిలోని బావి వద్ద గేదెను కట్టేసి ప్రతి రోజు ఉదయం, సాయంత్రం వెళ్లి పాలు పితుక్కొని వస్తాడు. రోజు మాదిరిగానే శుక్రవారం ఉదయం వెళ్లి పాలు పితికి వచ్చిన రాజేందర్ మధ్యాహ్నం వెళ్లి గేదెకు మేత వేసి వచ్చాడు. మళ్లీ సాయంత్రం పాలు పితుకుదామని వెళ్లే సరికి గేదె కనిపించలేదు. చుట్టుపక్కల వెతికినా గేదె ఆచూకీ దొరకలేదు. గుర్తుతెలియని దుండగలు తన గేదెను అపహరించుకెళ్లారన్నారు. రాజేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ హరికృష్ణ తెలిపారు.

గుడుంబా కేంద్రాలపై దాడులు

- ఇద్దరి అరెస్ట్, 40 లీటర్ల గుడుంబా స్వాధీనం



శాయంపేట : మండలంలోని నేరేడుపల్లి గ్రామంలో గుడుంబా స్థావరాలపై శనివారం ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించగా 40 లీటర్ల గుడుంబా లభ్యం కాగా స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ తాతాజీ తెలిపారు. గుడుంబా విక్రయిస్తున్న కడెం రాజమ్మ, ఒంటేరు కొమురమలమ్మపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు. మండలంలోని గట్లకానిపర్తికి ఆటోలో గుడుంబా రవాణా చేస్తున్నారన్న పక్కా సమాచారం మేరకు రూట్‌వాచ్ చేసి తనిఖీలు చేయగా 20 లీటర్ల నాటుసారాను ఆటోను స్వాధీనం చేసుకొని సీజ్ చేసి దుస్సా నాగరాజుపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్సైలు జ్యోతి, సులోచన, హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణాచారి, సిబ్బంది విజయ్‌కుమార్, అఖిల్‌కుమార్ పాల్గొన్నారు.

రైతు పండుగలో ఏఎంసీ చైర్‌పర్సన్



కమలాపూర్: మండలంలోని వంగపల్లి రైతు వేదికలో శనివారం ఏర్పాటు చేసిన రైతు పండుగ కార్యక్రమంలో కమలాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ తౌటం ఝాన్సీ రాణి-రవీందర్ అధికారులు, కమిటీ డైరెక్టర్లు, రైతులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహబూబ్‌నగర్‌లో జరిగిన రైతు పండుగ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి రైతు రుణమాఫీ, రైతు భరోసా, ధాన్యం కొనుగోళ్లు, బోనస్ చెల్లింపులు తదితర అంశాలపై ఇచ్చిన సందేశాన్ని రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీక్షించారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ దేశిని ఐలయ్యగౌడ్, డైరెక్టర్లు సముద్రాల కృష్ణ, గట్టు శ్రీధర్‌గౌడ్, కిన్నెర కృష్ణమూర్తి, ఏఓ జాలి లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ నాయకులు బాలపురి కనుకరత్నం, ఎల్లమ్మ, నారాయణరెడ్డి, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

అసంపూర్తిగా యార్డు నిర్మాణం

- నత్తనడకన సబ్ మార్కెట్ పనులు
- గడువులోగా పూర్తిచేయని కాంట్రాక్టర్
- ఇబ్బందులు పడుతున్న రైతులు



అసంపూర్తిగా ఉన్న మార్కెట్ యార్డు షెడ్లు





పనులు మధ్యలోనే నిలిచిపోవడంతో అసంపూర్తిగా ఉన్న ఆఫీస్ రూం, మరుగుదొడ్ల నిర్మాణం

వేలేరు : మండలంతో పాటు చుట్టుప్రక్కల మండలాల రైతులు పండించిన పంటలను విక్రయించేందుకు వరంగల్ ఏనుమాముల మార్కెట్‌కు వెళ్లాల్సిందే. రైతులు పంటకు గిట్టుబాటు ధర రాకపోవడంతో పాటు దూరప్రాంతాలకు వెళ్లి విక్రయిస్తే ఆర్థిక భారంతో అప్పులు తప్ప పైసా మిగిలే పరిస్థితి లేదు. అదే సబ్ మార్కెట్ యార్డు నిర్మాణం పూర్తయితే రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర దక్కడంతో పాటు దళారుల బెడద తప్పనుంది. సకాలంలో రైతులు పండించిన పంటను విక్రయించుకునే అవకాశం ఉంటుందని, దూరప్రాంతాల్లోని మార్కెట్లకు వెళ్లలేక పండించిన పంటలను దళారులకు అమ్ముకునే బాధ తప్పుతుందనే ఆలోచనతో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఏనుమాముల మార్కెట్‌కు అనుసంధానంగా మండలంలోని షోడాషపల్లి శివారులో రైతుల సౌకర్యార్థం 5 ఎకరాల స్థలంలో సబ్ మార్కెట్‌యార్డు నిర్మాణానికి 2022 ఏప్రిల్‌లో రూ.1.98 లక్షలతో అప్పటి ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య, ప్రస్తుత జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి సబ్ మార్కెట్ యార్డు నిర్మాణానికి భూ మిపూజ చేసి పనులను ప్రారంభించారు. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్‌ను గడువులోగా పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. అయితే మార్కెట్‌యార్డు నిర్మాణ పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్ మార్కెట్ యార్డు చుట్టూ ప్రహరీ నిర్మించారు. లోపల రెండు షెడ్లు, ఆఫీస్ రూం, మరుగుదొడ్ల నిర్మాణ పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు, స్థానిక ఎమ్మెల్యే స్పందించి సబ్ మార్కెట్ యార్డు నిర్మాణ పనులు పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని మండల రైతులు కోరుతున్నారు.

పనులు త్వరగా పూర్తి చేయాలి



మండలంలోని షోడాషపల్లి శివారులో నిర్మిస్తున్న సబ్ మార్కెట్ యార్డు పనులను త్వరగా పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలి. వరంగల్‌కు తీసుకువెళ్తే రవాణా ఖర్చులు అధికమవుతున్నాయి. – రాజు, పీచర

పౌరహక్కులపై అవగాహన ఉండాలి



దామెర : కోగిల్వాయిలో అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ జ్యోతివరలక్ష్మీదేవి



శాయంపేట : సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సై ప్రమోద్‌కుమార్

- దామెర తహసీల్దార్ జ్యోతివరలక్ష్మీదేవి

దామెర : రాజ్యాంగం కల్పించిన పౌరహక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగిఉండాలని తహసీల్దార్ జ్యోతివరలక్ష్మీదేవి అన్నారు. మండలంలోని కోగిల్వాయిలో శనివారం పౌరహక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని అవగాహన సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సమాజంలో ఎవరి హక్కులకు భంగం కలిగించొద్దని అన్నారు. పౌరహక్కులకు భంగం కలిగించే వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. కుల వివక్ష, అంటరానితనం నిర్మూలించి అన్ని మతాల, కులాల వారు సోదరభావంతో మెలగాలని సూచించారు. ఎస్సై అశోక్ మాట్లాడుతూ అసమానతలు లేని సమాజ స్థాపనకు కృషిచేయాలని పిలుపునిచ్చారు. ఆర్ఐ భాస్కర్ రెడ్డి, కార్యదర్శి సరళ, పాల్గొన్నారు.

శాయంపేట : భారత రాజ్యాంగం ద్వారా పౌరులందరికీ సమాన హక్కులు కల్పించిందని డిప్యూటీ తహసీల్దార్ ప్రభావతి అన్నారు. మండలంలోని పత్తిపాక గ్రామంలోని దళిత కాలనీలో శనివారం పౌర హక్కుల దినోత్సవం నిర్వహించగా ఆమె పాల్గొని మాట్లాడుతూ ఏ సమస్యలు తలెత్తినా తమ దృష్టికి తీసుకొని వస్తే తక్షణమే పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. ఎస్సీ కాలనీలో డ్రెయినేజీ కాల్వలు సరిగా లేవని, వీధిలైట్లు వెలగక ఇబ్బందులు పడుతున్నామన్నారు. నాటుసారా నిర్మూలించి, బెల్ట్‌షాపులను బంద్ చేసి వారిపై చర్యలు తీసుకుంటామని ఎస్సై ప్రమోద్‌కుమార్ తెలిపారు. డ్రెయినేజీ సమస్యలు తక్షణమే పరిష్కరిస్తామని, వీధిలైట్లు ఏర్పాటు చేస్తామని ఎంపీడీఓ ఫణిచంద్ర తెలిపారు. ఎంఈఓ భిక్షపతి, ఎమ్మార్ఐ రమేష్‌ఖన్నా, ఆర్ఐ రమేష్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మతోన్మాదాన్ని రెచ్చగొడుతున్న బీజేపీ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న లింగయ్య

ఐనవోలు: దేశంలో అధికారంలోకి వచ్చిన భారతీయ జనతా పార్టీ మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ దేశ సంపదను కార్పొరేట్లకు అప్పగిస్తోందని సీపీఎం మండల కార్యదర్శి కాడబోయిన లింగయ్య ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం మండలంలోని వెంకటాపురంలో డిసెంబర్ 2న సాయంత్రం మండల కేంద్రంలో నిర్వహించ తలపెట్టిన సీపీఎం మండల బహిరంగ సభ కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం లింగయ్య మాట్లాడుతూ డిసెంబర్ 2, 3 తేదీల్లో సీపీఎం ఆధ్వర్యంలో మహాసభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అదేవిధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలను ఎండగట్టారు. కార్యక్రమంలో నాయకులు నారాయణరెడ్డి, ఉప్పలయ్య, రాంకుమార్, నాగరాజు, యాకయ్య, కొంరయ్య, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

మల్లన్నను దర్శించుకున్న 'కుడా' చైర్మన్



మల్లన్నను దర్శించుకుంటున్న 'కుడా' చైర్మన్ వెంకట్రాంరెడ్డి దంపతులు

ఐనవోలు : మల్లికార్జునస్వామి ఆలయాన్ని కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి శనివారం సతీసమేతంగా దర్శించుకున్నారు. అదేవిధంగా మాజీ ఎంపీ చాడ సురేష్‌రెడ్డి దంపతులు, ఈగ మల్లేశం దంపతులు మల్లన్నను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వీరికి వేద పండితులు, అర్చకులు వేదాశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. ప్రముఖులకు ఈఓ అద్దంకి నాగేశ్వర్‌రావు స్వామి వారి శేషవస్త్రాలు అందజేశారు. కాగా 'కుడా' ఆధ్వర్యంలో గతంలో ఆలయంలో చేపట్టిన కల్యాణ మండపం, డార్మెటరీ హాల్ పనులు మధ్యలో నిలిచిపోయాయని ఈఓ గుర్తు చేశారు. అందుకు సంబంధించిన ఫైల్ తీసుకుని కార్యాలయానికి రావాలని 'కుడా' చైర్మన్ సూచించారని ఈఓ తెలిపారు. దేవాలయ ప్రాంగణంలో రూ.15 లక్షలతో రెండు కాటేజీలు చాడ సురేష్‌రెడ్డి, మరో రూ.15 లక్షలతో రెండు కాటేజీలు ఈగ మల్లేశం వారి తల్లిదండ్రుల జ్ఞాపకార్థం నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చినట్లు ఈఓ నాగేశ్వర్‌రావు తెలిపారు.

రుచికరమైన భోజనం అందించాలి



దామెర: విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలని డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఓ.చిరంజీవి అన్నారు. మండలకేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన భోజనం అందక విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ఫుడ్ పాయిజన్ ప్రమాదాలు జరుగుతూ ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించి మెస్‌చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. మెనూ ప్రకారం భోజనం అందించి, వంటపాత్రలు, వంటగదిని శుభ్రంగా ఉంచే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఆయన వెంట రాజ్‌కుమార్, నక్క దీక్షిత్, ఎస్, సాయికృష్ణ, డి.వరుణ్, శివకుమార్, రాజు తదితరులు ఉన్నారు.

కొడుతున్నాడని హతమార్చారు..

- భర్తపై పెట్రోల్ పోసి చంపిన భార్య, ఆమె కూతురు
- శాయంపేటహవేలిలో ఘటన



సునీల్(ఫైల్)

గీసుకొండ: తమను కొట్టడమే కాకుండా పలు రకాలుగా వేధింపులకు గురి చేస్తున్నాడనే నెపంతో ఓ వ్యక్తిని అతడి భార్య, పెంపుడు కూతురు పెట్రోల్ పోసి నిప్పంటించి హత్య చేశారు. ఈ ఘటన వరంగల్ జిల్లా గీసుకొండ మండలం శాయంపేటహవేలిలో జరిగింది. మృతుడి అక్క, గీసుకొండ పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కోటగిరి సునీల్(36) 12 సంవత్సరాల క్రితం హనుమకొండ జిల్లా దామెర మండలం ఊరుగొండకు చెందిన మేకల లక్ష్మి ని వివాహం చేసుకున్నాడు. లక్ష్మికి కూతురు సిరి (లక్ష్మి, తన మొదటి భర్తకు జన్మించిన కూతురు) ఉండగా ఆమెను చిన్నప్పటి నుంచి తన దగ్గరే పెంచి పోషిస్తున్నాడు. సునీల్, లక్ష్మి దంపతులకు కుమారుడు జన్మించాడు. ఇదిలా ఉండగా సిరి కొద్ది రోజుల క్రితం ఓ యువకుడితో ఫోన్‌లో మాట్లాడినట్లు తెలిసి భార్య లక్ష్మిని, సిరిని కొట్టాడు. విషయం తెలుసుకున్న ఊరుగొండలో ఉంటున్న అతడి అక్క మేకల నీరజ, ఆమె భర్త రవీందర్‌తో పాటు మరో ఇద్దరు శుక్రవారం శాయంపేటకు వెళ్లి సునీల్‌ను సముదాయించి ఆదివారం మాట్లాడదామని సర్ది చెప్పి వెళ్లారు. అదే రోజు రాత్రి సునీల్ భార్య లక్ష్మి, ఆమె కూతురు సిరి అతడిపై పెట్రోల్ పోసి నిప్పంటించి ఇంటి తలుపులు పెట్టారు. సునీల్ కేకలు విన్న ఇరుగుపొరుగు వారు వచ్చి తలుపులు తెరిచి వరంగల్ ఎంజీఎం తరలించగా చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందాడు. కాగా, తన తమ్ముడి మృతికి కారణమైన అతడి భార్య లక్ష్మి, కూతురు సిరిపై చర్యలు తీసుకోవాలని మృతుడి అక్క మేకల నీరజ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు గీసుకొండ ఇన్‌స్పెక్టర్ మహేందర్ తెలిపారు. కాగా, ఘటనా స్థలిని మామునూరు ఏసీపీ తిరుపతి, గీసుకొండ ఇన్‌స్పెక్టర్ మహేందర్ పరిశీలించారు.


'విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడొద్దు'

విద్యారణ్యపురి: విద్యార్థుల ప్రాణాలతో ప్రభుత్వం చెలగాటమాడొద్దని ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ విద్యార్థి సంఘాల నాయకులు హెచ్చరించారు. ఈమేరకు ప్రభుత్వ పాఠశాలల తరగతులను శనివారం బహిష్కరించారు. హనుమకొండలోని సుబేదారి ప్రభుత్వ హైస్కూల్ వద్ద నిరసన తెలిపారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింహరావు, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ప్రణీత్, సంఘాల బాధ్యులు, తదితరులు పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ

ఖిలా వరంగల్: మహానగర పాలక సంస్థ ఆధ్వర్యంలో వరంగల్ తిమ్మాపురంలో పారిశుద్ధ్య కార్మికులకు యూనిఫాంను శనివారం పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా స్థానిక కార్పొరేటర్ జలగం అనిత హాజరై వారికి అందజేశారు. కార్యక్రమంలో రమేష్, చెన్నారెడ్డి, కోటేశ్వర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీందర్, జవాన్ మైదం కుమార్, మౌనిక, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానంతో ఇద్దరికి చూపు



నేత్రదాన సర్టిఫికెట్ ప్రదానం చేస్తున్న అసోసియేషన్ సభ్యులు

నడికూడ : నేత్రదానంతో ఇద్దరికి కంటి చూపు లభిస్తుందని అసోసియేషన్ సభ్యులు అన్నారు. మండలంలోని సర్వాపూర్ గ్రామానికి చెందిన భోగి కొమురుమల్లు (80) అనారోగ్యంతో మృతి చెందగా మృతుని కుమారుడు రాములు, కూతురు శారద నేత్రదానం చేస్తామని అంగీకరించి లయన్స్ క్లబ్ హనుమకొండ, తెలంగాణ నేత్రదానం, అవయవ, శరీరదాతల అసోసియేషన్ వరంగల్ వారికి సమాచారం ఇచ్చారు. అసోసియేషన్ డీఈ రవీందర్ ఆధ్వర్యంలో ఎల్‌వీ ప్రసాద్ ఆస్పత్రి నేత్ర సేకరణ నిపుణులు నరేందర్ నేత్రాలను సేకరించారు. అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ మరణానంతరం నేత్రదానం చేసి అంధనివారణకు తోడ్పడాలన్నారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలిపి సర్టిఫికెట్ ప్రదానం చేశారు.

విద్యారంగానికి ప్రభుత్వ ప్రాధాన్యం

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు
- గురుకుల పాఠశాలలను సందర్శించిన ఎమ్మెల్యే



విద్యార్థులకు బెడ్‌షీట్స్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

శాయంపేట : తెలంగాణ సీఎం ఎనుముల రేవంత్ రెడ్డి గురుకుల పాఠశాల విద్యార్థులకు 40 శాతం మెస్ చార్జీలు పెంచారని, విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. మండలంలోని గోవిందాపూర్ శివారులోని కస్తూర్బాగాంధీ గురుకుల పాఠశాలను సందర్శించి కూరగాయలు, వంటశాలను, స్టోర్‌రూంను సందర్శించి పరిశీలించారు. కూరగాయలు రోజువారీగా తెప్పించుకోవాలని, రెండు మూడు రోజులకోసారి తీసుకొని వస్తే కుళ్లిపోతాయని స్పెషల్ ఆఫీసర్ మాధవికి సూచించారు. పండ్లు కుళ్లి పోయి ఉండడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తూ సంబంధిత కాంట్రాక్టర్‌పై జిల్లా కలెక్టర్‌కు ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. విద్యాశాఖ డైరెక్టర్ నరసింహారెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని 8700 మంది గురుకుల విద్యార్థులకు సొంత ఖర్చులతో బెడ్‌షీట్‌లు అందజేస్తున్నట్లు తెలిపారు. పాఠశాలలో ఏ సమస్య ఉన్న తన దృష్టికి తీసుకొని వస్తే సమస్యను పరిష్కరిస్తానని విద్యార్థులకు భరోసా ఇచ్చారు. అనంతరం సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను సందర్శించి తరగతి గదులను, వంటశాలను సందర్శించి పరిశీలించారు. అనంతరం మహాత్మజ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాలలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం పాఠశాలలో బడినిద్ర చేశారు. ఆయన వెంట పాఠశాల ప్రిన్సిపాల్స్ రజని, రేవతి, మాజీ ఎంపీపీ బాసాని చంద్రప్రకాష్, పరకాల ఏఎంసీ వైస్ చైర్మన్ రవీందర్, మండల పార్టీ అధ్యక్షుడు బుచ్చిరెడ్డి, రవి, రమేష్, రవిపాల్, శ్రీనివాస్ రెడ్డి, భిక్షపతి, నాగరాజు ఉన్నారు.

ఫిర్యాదులపై పారదర్శకంగా వ్యవహరించాలి

- కాజీపేట ఏసీపీ తిరుమల్



ముల్కనూరు పీఎస్ ప్రాంగణంలో మొక్క నాటుతున్న ఏసీపీ తిరుమల్

ఎల్కతుర్తి: పోలీసుల పట్ల ప్రజలకు నమ్మకాన్ని పెంచే విధంగా విధులు నిర్వర్తించాలని కాజీపేట ఏసీపీ తిరుమల్ అన్నారు. శనివారం భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. అనంతరం వచ్చిన ఫిర్యాదులపై ఎలాంటి చర్యలు తీసుకోవడం జరిగిందని సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే పెండింగ్‌లో ఉన్న కేసులు, వాటికి సంబంధించిన దర్యాప్తు వివరాలు ఎస్సై సాయిబాబును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏసీపీ మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్‌కు వచ్చేవారితో సిబ్బంది మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలని, సమస్యతో వచ్చే ఫిర్యాదుదారులకు సమస్య పరిష్కారమవుతుందనే నమ్మకాన్ని వారిలో కలిగించాలన్నారు. పోలీస్‌శాఖ కీర్తి ప్రతిష్ఠలకు భంగం కలిగించే విధంగా వ్యవహరించినట్‌లైతే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. ఆయన వెంట సీఐ పులి రమేశ్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

డేటా ఎంట్రీ త్వరగా పూర్తి చేయాలి

- ఎంపీడీఓ గుండె బాబు



సర్వే డేటా ఎంట్రీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ బాబు

కమలాపూర్ : డిసెంబర్ 1లోగా సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే డేటా ఎంట్రీని వందశాతం పూర్తి చేయాలని ఎంపీడీఓ గుండె బాబు ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లను ఆదేశించారు. స్థానిక తెలంగాణ మోడల్ స్కూల్‌లో నిర్వహిస్తున్న సర్వే డేటా ఎంట్రీని శనివారం ఆయన పరిశీలించారు. ప్రతి ఎన్యుమరేటర్ డేటా ఎంట్రీ ఆపరేటర్ దగ్గరుండి తాము సర్వే చేసిన సమగ్ర కుటుంబ సర్వే వివరాలను ఆన్‌లైన్ చేయించాలని, లేనట్‌లైతే ఎన్యుమరేటర్‌పై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంపీడీఓ గుండె బాబు సూచించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు తెలంగాణ మోడల్ స్కూల్‌ను ఆయన సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని, మెనూ చార్ట్‌ను, బాలికల వసతి గృహాన్ని, పరిసర ప్రాంతాలను ఆయన పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందిస్తున్నారా? లేదా? అని అడిగి తెలుసుకున్నారు. మెనూ పాటించకున్నా, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అదించకున్నా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.అనిత, బాలికల హాస్టల్ ఇన్‌చార్జ్, కేజీబీవీ ఎస్ఓ అర్చన, కేర్ టేకర్ సుమలత, ఏఎన్ఎం రజిత, ఏపీఓ రమేష్, ఈసీ కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.

ఫుడ్ పాయిజన్‌కు ప్రభుత్వమే బాధ్యత వహించాలి

- డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తిరుపతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

ఆత్మకూరు: ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న ఫుడ్ పాయిజన్‌కు ప్రభుత్వమే బాధ్యత వహించాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డి.తిరుపతి అన్నారు. ఫుడ్ పాయిజన్‌పై సీఎం రేవంత్‌రెడ్డి స్పందించాలని కోరారు. మధ్యాహ్న భోజన పథకానికి నిధులు పెంచాలని కోరుతూ డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆత్మకూరులో ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ జగన్మోహన్‌రెడ్డికి వినతిపత్రం అందజేసిన అనంతరం తిరుపతి మాట్లాడుతూ నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్నా ప్రభుత్వం మధ్యాహ్న భోజనం పథకానికి మాత్రం నిధులు పెంచకపోవడం వల్ల విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు ఎం.అఖిలేష్, బి.చరణ్, డి.నాగచరణ్, పి.అజయ్, బి.శివమణి, జస్వంత్ పాల్గొన్నారు.

విద్యాసంస్థల బంద్ విజయవంతం



మాట్లాడుతున్న ఇస్మాయిల్

శాయంపేట : రాష్ట్రంలో ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శనివారం మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల బంద్‌ను విజయవంతం చేసినట్లు ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు ఎండీ.ఇస్మాయిల్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించకపోవడంతో ఇటీవల ఫుడ్‌పాయిజన్‌తో గురుకుల విద్యార్థి మృతి చెందినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. శైలజ కుటుంబానికి రూ. 50 లక్షల పరిహారం చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రానికి విద్యాశాఖ మంత్రిని వెంటనే నియమించాలని లేనిపక్షంలో రాబోయే రోజుల్లో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల నాయకులు చిందం విఘ్నేష్, కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.